దివ్యాంగుల ఆటల పోటీలు ప్రారంభం

జెండా ఊపి దివ్యాంగుల ఆటల పోటీలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి, నవంబర్ 16 : మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు ఆటల పోటీలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ విక్టర్ హాజరై జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి చందర్ నాయక్, కార్యాలయ సిబ్బంది, దివ్యాంగులు తదితరులు పాల్గొన్నారు.

సర్వే గడువు పొడిగించాలి

అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

కామారెడ్డి, నవంబర్ 16 : కుల గణనకు సంబంధించి క్షేత్రస్థాయంలో ఎదురవుతున్న ఇబ్బందుల దృష్ట్యా టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్యుమరేటర్ల సంఖ్యను పెంచాలని, సర్వే గడువును పొడిగించాలని కోరామన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగం, ఉపాధ్యక్షురాలు నతనీ దేవి, కార్యదర్శి నరేందర్, లక్ష్మి, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

కామారెడ్డి, నవంబర్ 16 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్ శివారులో శనివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తుల వద్ద నుంచి గంజాయి పట్టుకున్నామని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, ఒక బైక్, రూ.700లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ విషయమై ఎన్‌డీపీఎస్ యాక్ట్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వీరు యూపీ రాష్ట్రానికి చెందినవారుగా గుర్తించామని తెలిపారు.

నిబంధనల మేరకు నష్టపరిహారం చెల్లిస్తాం

సబ్ కలెక్టర్ కిరణ్మయి

నస్రుల్లాబాద్, నవంబర్ 16 : జాతీయ రహదారి 765డీ రోడ్డు విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న బాధిత రైతులు, ఇండ్లు కోల్పోతున్న గ్రామస్తులకు ప్రభుత్వ నిబంధనల మేరకు నష్ట పరిహారం అందిస్తామని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని సమీకృత మండల భవన సముదాయంలో ఆమె శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇండ్లు, పొలాలు కోల్పోతున్న బాధితులకు నోటీసులు అందాయా అని అడిగి తెలుసుకున్నారు. వారి వివరాలను నమోదు చేసుకున్నారు. రోడ్డు మధ్యలో నుంచి 50 ఫీట్లు ఉన్న ఇండ్ల కూల్చివేతకు మొదలు నోటీసులు అందజేయాలని రోడ్డు పనుల కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం రైతులు మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందించాలని కోరారు. ప్రభుత్వం నిబంధనల మేరకు పరిహారం అందిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్‌లోని తహసీల్ కార్యాలయంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

లబ్ధిదారులకు బిల్లులు అందజేత

లబ్ధిదారులకు బిల్లులను అందజేస్తున్న వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ టౌన్, నవంబర్ 16 : బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిర్మించుకున్న లబ్ధిదారులకు వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ఆయన స్వగృహంలో శనివారం బిల్లులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.7.51 కోట్ల బిల్లులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గం పరిధిలోని ఆయా మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి

బీబీపేట్, నవంబర్ 16 : మండల కేంద్రంలోని టీఎస్ ఎన్ఆర్ ప్రభుత్వ బాలుర పాఠశాలలో వ్యాపారవేత్త తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి కంప్యూటర్ ల్యాబ్‌ను శనివారం ప్రారంభించారు. పూర్వ విద్యార్థి చింతకింది కళాకర్(ఢిల్లీ కెనరా బ్యాంక్ ఏజీఎం) సహకారంతో 12 కంప్యూటర్లను అందించడంతో సుభాష్‌రెడ్డి చేతుల మీదగా కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మకాంటా యజమానికి జరిమానా

మాచారెడ్డి, నవంబర్ 16 : మండలంలోని చుక్కాపూర్ గ్రామంలో ఉన్న ధర్మకాంటా యజమానికి రూ.పదివేలు జరిమానా విధించినట్లు తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపారు. మండలంలోని కొత్తపల్లి రైతులు తమ ధాన్యాన్ని పాల్వంచ రైస్ మిల్లుకు కేటాయించగా అక్కడ ధర్మకంటా లేదు. చుక్కాపూర్‌లో ఉన్న ధర్మకాంటా వద్ద కొలతలు తీసుకోగా 30 టన్నుల ధాన్యానికి క్వింటాల్ తక్కువగా వచ్చింది. దీంతో రైతుల ఫిర్యాదు మేరకు తనిఖీ చేయగా ధర్మకాంటాలో లోపం ఉన్నదని గుర్తించి జరిమానా విధించినట్లు తెలిపారు.

కడుపులోనే శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందినట్లు కుటుంబీకుల ఆరోపణ
- తమ నిర్లక్ష్యం ఏమీలేదని వైద్యుల వివరణ

కామారెడ్డి, నవంబర్ 16 : వైద్యుల నిర్లక్ష్యంతో కడుపులోని శిశువు మృతి చెందిన ఘటన కామారెడ్డిలోని జిల్లా దవాఖానలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రామారెడ్డి మండలానికి చెందిన రాధకు ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లికి చెందిన శేఖర్‌తో వివాహమైంది. మొదటి కాన్పులో మగబిడ్డ జన్మించాడు. రెండో బిడ్డ కాన్పు కోసం శనివారం జిల్లా దవాఖానకు వచ్చామన్నారు. వైద్యులు సాధారణ ప్రసవం కోసం ప్రయత్నిస్తుంటే మొదటి కాన్పు ఆపరేషన్ అయ్యిందని, ఇప్పుడు కూడా ఆపరేషన్ చేయాలని కోరినా వైద్యులు పట్టించుకోలేదని ఆరోపించారు. సుమారు రెండు గంటలపాటు సాధారణ ప్రసవం కోసం ప్రయత్నించారని, తర్వాత ఆపరేషన్ చేసి మృతి చెందిన శిశువును అప్పగించాలని అన్నారు. దీంతో కుటుంబ సభ్యులు వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ఫరీదాను వివరణ కోరగా రాధకు ప్రసవానికి ఈ నెల 23వ తేదీ సమయం ఉందని, కానీ.. నొప్పులు రావడంతో వారిని శుక్రవారం రమ్మని చెప్పామని, వారు రాలేరని తెలిపారు. శుక్రవారం వచ్చిఉంటే అడ్మిట్ చేసుకొని వైద్యం అందించేవారమని అన్నారు. కానీ.. వారు శనివారం వచ్చారని, ఆపరేషన్ చేద్దామంటే ప్రసవం చేసేలోపు కడుపులోనే శిశువు మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనలో వైద్యుల నిర్లక్ష్యం ఏమీ లేదని తెలిపారు.

ఏబీవీపీ నాయకుల అరెస్టు

భిక్కనూరు, నవంబర్ 16 : అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు ఏబీవీపీ నాయకులు గంధం సంజయ్ అన్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని స్వాతి కుటుంబానికి వెంటనే న్యాయం చేయాలని అడిగిన విద్యార్థి నాయకులపై దాడి చేసిన సిబ్బందిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బాసర ట్రిపుల్ ఐటీ ముట్టడికి వెళ్తున్నారన్న సమాచారంతో ఏబీవీపీ, కామారెడ్డి ఎస్ఎఫ్‌డీ ఇన్‌చార్జి గంధం సంజయ్‌ని అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికైనా మఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కొనసాగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

కామారెడ్డి, నవంబర్ 16 : కామారెడ్డిలోని జిల్లా గ్రంథాలయంలో శనివారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఎల్లారెడ్డిలో దొంగతనం..

- నాలుగు దుకాణాల షట్టర్లను గడ్డపారతో తెరిచిన దుండగుడు
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన క్లూస్ టీం

తెరిచి ఉన్న షెట్టర్లను పరిశీలిస్తున్న ఏఎస్సై గంగారెడ్డి

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 16: ఎల్లారెడ్డి పట్టణంలోని తెలంగాణ భవన్‌లో ఉన్న వ్యాపార సముదాయాల్లో శుక్రవారం రాత్రి దొంగలు పడ్డారు. శనివారం ఉదయం యజమానులు తమ దుకాణాలను తెరవడానికిరాగా షట్టర్లు తెరిచి ఉండడం చూసి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని ఏఎస్సై గంగారెడ్డి, కానిస్టేబుళ్లు పరిశీలించారు. కాంప్లెక్స్‌లోని అబ్దుల్ ఘనీ హోటల్ నుంచి రూ.3వేలు, సయ్యద్‌మీర్ గోడౌన్ నుంచి పెయింట్ బకెట్స్, శ్రీ కంప్యూటర్స్ నుంచి ఒక ఆయిల్ డబ్బాను దొంగిలించారు. ఐడియా ఆఫీస్ షట్టర్ తెరుచుకోకపోవడంతో విఫలయత్నం చేసి వెళ్లిపోయారు. ఒకేరోజు రాత్రి కాంప్లెక్స్‌లోని నాలుగు షట్టర్లను గడ్డపారతో తెరిచి దొంగతనం చేయడం పట్టణంలో కలకలం రేపింది. క్లూస్ టీం సభ్యులు ఆధారాలు సేకరించినట్లు ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపారు. దుకాణాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు పట్టణంలో కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎల్లారెడ్డిలో బిచాణా ఎత్తేసిన పీఎంపీ

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 16: వైద్యం వికటించడంతో ఆరోగ్య పరిస్థితి దెబ్బతిన్న మహిళ సదరు పీఎంపీతో వాగ్వాదానికి దిగడంతో బెంబేలెత్తిపోయిన పీఎంపీ రవీందర్ దవాఖానను ఖాళీ చేసి వెళ్లిపోయాడు. ఈ ఘటన ఎల్లారెడ్డి పట్టణంలో చోటు చేసుకుంది. ఈ నెల 12న పట్టణంలోని బీసీ కాలనీలో పీఎంపీతో ఆరోగ్యం దెబ్బతిన్న మహిళ గొడవపడింది. ఈ విషయం సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో పీఎంపీ అర్ధరాత్రి సమయంలో దవాఖానను ఖాళీచేసి వెళ్లిపోయాడు. తనకు ఎటువంటి న్యాయం జరగకపోగా, దవాఖానను ఖాళీ చేసి వెళ్లి పోవడంతో సదరు మహిళ అవాక్కైంది.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

గాంధారి, నవంబర్ 16: రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అండర్ -14 బాలబాలికల జట్లకు శనివారం బామన్ క్రీడా ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తులను అందజేసినట్లు పీడీ లక్ష్మణ్‌రాథోడ్ తెలిపారు. రెండు రోజులపాటు మెదక్ జిల్లా చేగుంటలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు.

'ఉపాధి హామీ'లో అవకతవకలు

పెద్దకొడప్‌గల్, నవంబర్16 : పిట్లం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శనివారం 15వ విడుత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. వారం రోజుల పాటు గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పథక సామాజిక తనిఖీల్లో అనేక విషయాలు వెలుగు చూశాయి. మండలంలోని మార్కండ గ్రామంలో అంధవ్యక్తి పని చేసినట్లు రూ.10,360 చెల్లించిన విషయం వెలుగు చూసింది. రాంపూర్ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ అంజాగౌడ్ తన భార్య పని చేయకున్నా డబ్బులు చెలించాడని అధికారులు వెల్లడించారు. ఇలాంటివి అనేకం బహిర్గతమయ్యాయని తెలిపారు.

కుటుంబ సర్వేను వేగవంతం చేయాలి

లింగంపేట, నవంబర్ 16: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆర్థిక, రాజకీయ, విద్య, సమగ్ర కుటుంబ సర్వేను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అధికారులకు సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వేపై సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టిన సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే కార్యక్రమం త్వరలో ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు కోసం కంప్యూటర్ ఆపరేటర్లను ఎంపిక చేసుకోవాలని సూచించారు. సర్వే ఫారాలను భద్రపరచడానికి కొనుగోలు చేసిన ట్రంకు పెట్టెలను ఆయన పరిశీలించారు. సర్వే నిర్వహణపై జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఆయనవెంట ఎంపీడీవో నరేశ్, తహసీల్దార్ నరేందర్, మండల పంచాయతీ అధికారి మలహరీ, గ్రామ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

ఎన్యుమరేటర్లకు సహకరించాలి..

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 16: సర్వే కోసం ఇంటింటికీ తిరుగుతున్న ఎన్యుమరేట్లకు ప్రజలు సహకరించాలని, నిజమైన సమాచారాన్ని అందజేయాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ సూచించారు. మండలంలోని వెల్లుట్లపేట గ్రామంలో ఆయన ఇంటింటి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు ఓపికగా ప్రతి అంశాన్ని కుటుంబ సభ్యులకు అడిగి రాయాలని పేర్కొన్నారు. ఆయనతో పాటు తహసీల్దార్ అల్లం మహేందర్, ఎంపీడీవో ప్రకాశ్ తదితరులున్నారు.

సర్వేను సందర్శించిన అధికారులు..

రామారెడ్డి, నవంబర్16: మండల కేంద్రంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను మండల స్పెషల్ ఆఫీసర్ సంజయ్ కుమార్, డీఎల్‌పీవో శ్రీనివాస్ సందర్శించి ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. వారివెంట ఎంపీడీవో తిరుపతిరెడ్డి, సమగ్ర సర్వే సూపర్‌వైజర్ పాశపు ధర్మారెడ్డి ఉన్నారు.

తప్పులు లేకుండా నమోదు చేయాలి..

లింగంపేట, నవంబర్ 16: సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్లు తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. మండలంలోని ముస్తాపూర్, బూరుగిద్ద, ఎల్లమ్మతండా, ఎల్లారం, మోతె గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే వివరాల కోసం గృహయజమానులపై ఒత్తిడి తేవొద్దని సూచించారు. ఆయనవెంట గ్రామ కార్యదర్శులు, సూపర్‌వైజర్లు ఉన్నారు.

బస్సులు నడపాలని వినతి

డిపో మేనేజర్ ఇందిరకు వినతిపత్రం అందజేస్తున్న పోసానిపేట్ వీడీసీ సభ్యులు

రామారెడ్డి, నవంబర్16: ఆర్టీసీ బస్సులను తమ గ్రామం మీదుగా నడపాలని మండలంలోని పోసానిపేట్ గ్రామస్తులు శనివారం డిపో మేనేజర్ ఇందిరను కలిసి వినతి పత్రం అందజేశారు. తమ గ్రామానికి సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, కామారెడ్డి నుంచి భీంగల్, అన్నారం, రెడ్డిపేట్ వెళ్లే బస్సులు పోసానిపేట్ మీదుగా వెళ్లడానికి అవకాశం ఉన్నందున తమ గ్రామం మీదుగా బస్సులను నడపాలని వీడీసీ ఆధ్వర్యంలో డిపో మేనేజర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో విన్నవించారు.

అల్మాజీపూర్‌కు బోరుమోటారు అందజేత

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 16: గ్రామంలో నెలకొన్న తాగునీటి, సాగునీటి సమస్య పరిష్కారానికి మాజీ జడ్పీటీసీ ఉషాగౌడ్ బోరు మోటారును గ్రామస్తులకు అందజేశారు. మండలంలోని అల్మాజీపూర్ గ్రామంలో నీటి సమస్య ఉండగా, పరిస్థితిని తెలుసుకున్న ఆయన శనివారం బోరు మోటారును అందజేసి నీటి సమస్యను పరిష్కరించారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

గాంధారి, నవంబర్ 16: మేతమేయడానికి వెళ్లిన ఎద్దుకు విద్యుత్ షాక్ తగలడంతో మృతిచెందిన ఘటన మండలంలోని దుబ్బ తండాలో చోటు చేసుకున్నది. తండా వాసులు తెలిపిన ప్రకారం.. మంజ చత్రు అనే రైతుకు చెందిన ఎద్దు తండా సమీపంలోని పంట చేనులో మేతమేయడానికి వెళ్లగా, పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు విలువ రూ. 50 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

ఈఎంఆర్ఎస్‌లో జన్ జాతీయ గౌరవ్ దివస్

గాంధారి, నవంబర్ 16: మండల కేంద్రంలోని తెలంగాణ ఏకలవ్య మోడల్ పాఠశాలలో శనివారం జన్ జాతీయ గౌరవ్ దివస్ నిర్వహించారు. గిరజనుల హక్కుల కోసం పోరాడిన బీర్సా ముండా జయంతిని పురస్కరించుకొని, ఈఎంఆర్ పాఠశాలలో వారం రోజుల పాటు జన్ జాతీయ గౌరవ్ దివస్ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భం గా పాఠశాల ఆవరణలో బీర్సా ముండా, బీఆర్ అంబేద్కర్, కొమురం భీమ్ చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గాంధారి, నవంబర్ 16 : ఆర్థిక సమస్యలతో జీవితంపై విరక్తి చెంది, గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గాంధారి ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్‌కు చెందిన ఆవునూరి సాయవ్వ (38) భర్త కాశీరాం తెలిసిన వారి దగ్గర అప్పులు చేసి ఇద్దరు కూతుళ్ల పెళ్లి చేశారు. అప్పులు తీర్చడానికి భర్త దుబాయి వెళ్లాడు. అక్కడకి వెళ్లిన భర్తకు సరైన పని దొరక్క ,అప్పులు తీర్చడం ఎలాగో తెలియక సాయవ్వ గురువారం గ్రామ సమీపంలో అటవీ రేంజ్ కార్యాలయం దగ్గర గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం నిజామాబాద్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

'సమస్యలు త్వరగా పరిష్కరిస్తా'

బిచ్కుంద, నవంబర్ 16: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను త్వరగా పరిష్కరిస్తానని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. బిచ్కుందలోని మార్కెట్ యార్డులో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని రోడ్లు, మౌలిక సదుపాయాలు తదితర వాటిని మెరుగు పరచడమే తన లక్ష్యమన్నారు. వీలైనంత త్వరగా గ్రామాల్లోని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లికార్జున్ అప్ప, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శంకర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

నిజాంసాగర్, నవంబర్ 16 : జుక్కల్ నియోజకవర్గంలోని ఎమెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం శనివారం ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అన్ని మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 16: పట్టణంలోని సమస్యలను పరిష్కరించడంలో సత్వర చర్యలు తీసుకుంటానని మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని 7వ వార్డులో ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో కలిసి పర్యటించి, వార్డు ప్రజల సమస్యలను తెలుసుకొని సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఆయనవెంట స్థానిక నాయకులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులున్నారు.

పొదల్లోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

- ఎదురుగా వస్తున్న కారును తప్పించే క్రమంలో ప్రమాదం
- విద్యార్థులు సురక్షితం, ఊపిరిపీల్చుకున్న తల్లిదండ్రులు

తాడ్వాయి (లింగంపేట), నవంబర్ 16 : కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలంలోని చిట్యాల గ్రామశివారులో ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఎదురుగా వస్తున్న కారును తప్పించే క్రమంలో ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి పట్టణంలోని వివేకానంద బీ టాపర్స్ ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు శనివారం ఉదయం చిట్యాల గ్రామం నుంచి విద్యార్థులను తీసుకొని కామారెడ్డికి వెళ్తున్నది. పాఠశాల బస్సుకు కారు అడ్డు రాగా.. కారును తప్పించే క్రమంలో బస్సు డ్రైవర్ శ్రీకాంత్ బస్సును రోడ్డు పక్కకు తిప్పాడు. దీంతో బస్సు పొదల్లోకి దూసుకెళ్లి ఓ చెట్టును ఆనుకొని బోల్తాపడకుండా ఆగింది. పాఠశాల బస్సు ప్రమాదానికి గురైన విషయం తెలియడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఘటనాస్థలానికి తరలివచ్చారు. ఈ ప్రమాదంలో విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఊపిరిపీల్చుకున్నారు.

అదుపు తప్పి రోడ్డు పక్కన పొదల్లోకి దూసుకువెళ్లిన బస్సు

విద్యుత్ బకాయిలు చెల్లించాలి

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 16: బకాయి పడ్డ విద్యుత్ బిల్లులను చెల్లించాలని సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ సిద్ధేందర్‌రెడ్డి పట్టణ ప్రజలను కోరారు. శనివారం ఎల్లారెడ్డి పట్టణంలో ఆయన సిబ్బందితో కలిసి విద్యుత్ బిల్లుల వసూలు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్, లైన్ మన్లు ప్రవీణ్‌రెడ్డి, మనోహర్, సిబ్బంది ఉన్నారు.

హైదరాబాద్‌కు ఎస్ఎస్ఏ ఉద్యోగులు

లింగంపేట, నవంబర్16: మండలంలో సమగ్ర శిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు శనివారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు ఇచ్చిన పిలుపు మేరకు మండలానికి చెందిన ఉద్యోగులు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో ఎస్ఎస్ఏ సిబ్బంది ఉన్నారు.

'సర్వే ఫాంలో మా కులం పేరు చేర్చండి'

పెద్దకొడప్‌గల్ నవంబర్ 16 : ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఫాంలో తమ కులం పేరు లేదని శనివారం జుక్కల్ కాయతి లంబాడా నాయకులు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జుక్కల్ నియోజకవర్గంలో బంజారా కాయాతి లంబాడా, మథుర లంబాడా ప్రజ లు నివసిస్తున్నారు.19977జీవో ప్రకారం బంజారా లంబాడా అని పిలిచేవారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎమ్మెల్యే చొరవ తీసుకొని సర్వే ఫాంలో తమ కులాన్ని చేర్చి, తమకు న్యాయం చేయాలని మండల బంజారా లంబాడా ప్రజలు విన్నవించారు. అస్రాత్, నానక్ సింగ్,తదితరులున్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న కాయతి లంబాడా నాయకులు

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, ISRAIL KHAN S/o. MOUL BAKASH R/o. H.No. 4-1-754/4A, Aneesanagar, Bodhan, Dist. Nizamabad, Changed My Name as ISMAIL KHAN
NTZ-338205

PLOT FOR SALE

★డిచ్‌పల్లి నుండి ఆర్మూర్ వెళ్లే మెయిన్ రోడ్ నుండి 50 మీటర్ల దూరంలో మార్కెట్ దగ్గర 24x76=202 Sq.yds. ప్లాట్ల ధర 20,000/- గజం మరియు 34x27=102 Sq.yds. ప్లాట్ల ధర 15,000/- గజం అమ్మకానికి కలవు. Ph: 9396411685 / 9493984827.
NT-336743

WANTED

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338958

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప